క్లుప్తంగా

దేవత చిత్రాల బాణాసంచా కాల్చొద్దు

మరికల్: పవిత్ర దీపావళి రోజున దేవి దేవతల చిత్రాలతో ఉన్న బాణాసంచా కాల్చొద్దని విశ్వ హిందు పరిషత్, భజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు రాంప్రకాస్‌గుప్తా, అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం సంయుక్త ప్రకటనలో కోరారు. విజయానికి ప్రతీకగా హిందుబంధువులు లక్ష్మీ దేవిని పూజిస్తు, దీపాలను వెలిగించి ఇంటింటా వెలుగు నింపుతారన్నారు. బాణాసంచాపై లక్ష్మీదేవి చిత్రాలతో తయారుచేసిన బాణాసంచాను పేల్చి హిందూ ధర్మాన్ని ఆపవిత్రం చేయొద్దని, దేవతల చిత్రాలు లేని బాణాసంచాను కాల్చి దీపావళిని జరుపుకోవాలన్నారు.

బీటీ రోడ్డు వేయాలని నిరసన

మరికల్: మల్యానాయక్‌తండాకు బీటీరోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ఇబ్రహీంపట్నం నుంచి మల్యానాయక్‌తండాతో పాటు పర్ణకుంటతండా, ఫర్దీపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. దశబ్దాల నుంచి ఈ రోడ్డును బీటీగా మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ప్రజలు రాకపోకల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందించి బీటీరోడ్డు మంజూరు చేయాలని కోరారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మాగనూర్: పశువులు రోగాల బారిన పడకుండా ముందస్తుగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ డాక్టర్ నరేందర్ రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని తళంకేరిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల పశుసంపదకులు తప్పకుండా వారి పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరి సిబ్బంది శశికుమార్, లక్ష్మి, పశువుల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట దగ్ధం



మాగనూర్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిపంటను కొందరు గుర్తుతెలియని దుండగులు చేసిన పనికి అగ్గిరూపంలో కోలుకోలేని నష్టాన్ని మిగిల్చాయి. రైతు పొలం వద్ద నిల్వచేసిన పత్తిని కొందరు తగులబెట్టడంతో వర్కూర్ గ్రామానికి రైతు శివప్ప ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలం వద్ద నిల్వ ఉంచిన సుమారు పది క్వింటాళ్ల పత్తిపంట మంటలో కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవాలని బాధిత కోరుతున్నారు.

బియ్యం దానం చేసిన కాకర్ల

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శక్తి పీఠానికి అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య బియ్యాన్ని శనివారం దానం చేశారు. శక్తి పీఠం వ్యవస్థాపకులు సంత్ శ్రీ శాంతానంద పురోహిత్ స్వామి చేస్తున్న నిత్య అన్నదాన సేవలను గుర్తించిన కాకర్ల భీమయ్య బియ్యాన్ని దానం చేసినట్లు తెలిపారు.

పాటు కాల్వలు నిర్మించుకోవాలి



మాగనూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో రైతులు పాటు కాల్వలు నిర్మించుకోవాలని మండల ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బైరంపల్లిలో ఉపాధిహామీ పనుల రెండో గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామంలోని రైతులను, ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు.. పాటుకాల్వలు, మట్టి రోడ్లు, ఒంద్రు మట్టి తదితర పనులకు అవకాశం ఉందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో పనులపై తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ

కృష్ణా: మహాలింగరాయ బ్రహ్మోత్సవాలకు అవసరమయ్యే ధాన్యాన్ని ఆ కుల సంఘం నాయకులు శనివారం ప్రత్యేక వాహనంలో సేకరించిన ధాన్యంతోపాటు ఇతరసామాగ్రితో భక్తులకు అన్నదాసోహాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు.. శనివారం మండలంలోని ప్రతి కురుబ కులస్తుడు స్వచ్ఛందంగా తమకు తోచిన సాయాన్ని అందిస్తారని తెలిపారు. నాయకులు కున్సీ మాజీ ఉపసర్పంచ్ బాల్‌రాజ్, బర్మనోళ్ల సురేష్, నాయకులు రాజు, కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

టీకా ప్రక్రియ వేగవంతం

- పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు
- టీకాలతో పశువులకు రక్షణ
- మండలంలో ప్రత్యేక బృందాలతో పశువులకు టీకాలు..



మరికల్‌లో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది

మరికల్: ముందస్తుగా పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎక్కువగా తెల్ల జాతి ఆవులు, ఎద్దులకి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు గుర్తించారు. వ్యాధి రాకముందే పశు సంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందుకు గాను టీంలుగా ఏర్పాటుచేసి గ్రామాల్లో ముందస్తు చర్యలో భాగంగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. టీకాలు వేసిన ప్రతి పశువుకు చెవికి పోగులా ట్యాగ్ వేశారు. ట్యాగ్ వేసిన పశువుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో పశువైద్య సిబ్బంది రెండు టీంలుగా ఏర్పడి గ్రామాలకు వెళ్లి గాలికుంటు టీకాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

టీకాతో పశువులకు రక్షణ..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేయించడంతో ముందుస్తుగా వాటిని కాపాడిన వారమవుతాం. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం కాని గిట్టల మధ్య పేగుళ్లు నోటీలో పుండ్లు పడటం భాగా నీరసించిపోవడం, పాలదిగుబడి తగ్గిపోవడం జరుగుతుంది. వ్యాధి సోకిన పశువుల్లో ఐదుశాతం చనిపోతుండటంతో ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు. అందుకే ఏటా రెండు సార్లు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. బయట ఈ టీకాలు వేయించాలంటే ఎక్కువగా డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పశువులు ఉన్న రైతులందరూ గాలికుంటు టీకాలు వేయించుకొని కాపాడుకోవాలి. నవంబర్ 14 వరకు టీకాలు వేసే గడవు ఉంది. రెండు టీంలుగా ఏర్పాటుచేసి పశువులకు టీకాలు వేయిస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలి.

- మహదేవ్, పశు వైద్యాధికారి, మరికల్

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: పత్తి పండించిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లిస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని శివారులోని పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలతో పత్తి వేసిన రైతులు పంటను నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, వైస్ చైర్మన్ హన్మంతు, నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భీమకవి, చంద్రకాంత్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



నాటుకోళ్లను పంపిణీచేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు

నర్వ: ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూతనిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల స్త్రీశక్తి భవన ఆవరణలో మహిళా సంఘాలచే నాటుకోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. బ్యాక్‌యార్డు ఫౌల్ట్రీ నాటు కోళ్లను మహిళా సంఘాల ఆధ్వర్యంలో దాదాపు 1800 కోళ్లను విక్రయించారు. ఒక్కో కోడి ధర రూ.100చొప్పున విక్రయాలు చేపట్టారు. వివిధ కార్యక్రమాల ద్వారా ఆదాయ సముపార్జన చేపట్టి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రుణాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డీపీఎం రామునాయక్, ఏపీఎం చంద్రశేఖర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, సీసీలు అంజప్ప, మహదేవప్ప, అరుణ, లక్ష్మమ్మ, అమృత పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు పెంచాలని వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

నారాయణపేట: సీసీఐ ఆధ్వర్యంలో అదనంగా పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు పత్తి మిల్లులను కొనుగోలు కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. కేవలం ఒకే కేంద్రం ద్వారా పత్తి కొనుగోలు జరుగుతుందని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మిగితా మూడు పత్తి మిల్లులలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. కలెక్టర్ స్పందించి సీసీఐ డీజీఎంకు ఫోన్‌లో మాట్లాడారు.. పత్తి కొనుగోలులో రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సోమవారం పత్తి, వరి కొనుగోలుపై అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటుచేయించి రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు గందె చంద్రకాంత్, ఎండీ సలీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శరణప్ప, వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్, మార్కెట్ కార్యదర్శి భారతి, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



మద్దూరు: అండర్ 17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు గుండుమాల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని దస్తమ్మ ఎంపికైనట్లు క్రీడా సహాయకురాలు స్వప్న శనివారం తెలిపారు. ఈ నెల 19 మహబూబ్‌నగర్‌లో జరిగిన క్రీడా పోటీలో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ నెల 28నుంచి 30 వరకు గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని సన్మానించి అభినందించారు.

విద్యార్థినికి సన్మానం



మరికల్: ఎంపీసీ మొదటి సంవత్సరం పరీక్షల్లో రాష్ట్రస్థాయి 5వ ర్యాంక్ సాధించిన సౌమ్యశ్రీని సూర్యచంద్ర ఫౌండేషన్ సంస్థ అధినేత సూర్య మోహన్‌రెడ్డి సన్మానించారు. మండలంలోని మణికంఠ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఆమె ఎంపీసీలో 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, రవికిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, రఘు, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, సత్యన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



మక్తల్: మండలంలోని వల్లభాపురంలో దత్తాత్రేయస్వామి ఆలయంలో ఏడురోజులపాటు గురు చరిత పారాయణ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణహుతి నిర్వహించిన అనంతరం ఆధ్యాత్మికంగా ప్రవచనాలను భక్తులకు ఉపదేశించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వనజమ్మ, ఆలయ చైర్మన్ దత్తప్ప, ఆలయ కార్యదర్శి రామలింగారెడ్డి, లక్ష్మన్, చక్రధర్, సత్యనారాయణ, రంగారెడ్డి, వెంకటేష్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

గోవింద నామావళిలో పేట మహిళలు



నారాయణపేట: తిరుమలలో రెండురోజుల పాటు జరిగే గోవింద నామావళికి పేటనుంచి స్వామి శివానంద, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ శ్యాం సుందర్‌గౌడ్ ఆధ్వర్యంలో 40మంది తిరుమలకు తరలివెళ్లారు. శనివారం స్వామివారి గోవింద నామావళిలో పాల్గొని స్వామివారిని స్మరించుకున్నారు.

సర్వేకు తప్పని తిప్పలు

మక్తల్: మండలంలోని కాచ్‌వార్‌లో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు శనివారం ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంట వివరాలు నమోదు చేస్తున్నారు. అయితే నెట్‌వర్క్ ఇబ్బందులతో సర్వే నంబర్లు, పాస్ బుక్ నంబర్లను నమోదుకు రైతులపేర్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

రైలు నిలపాలని ఎంపీకి వినతి



ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మరికల్: విశాఖపట్నం నుంచి రాయచూర్ వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలును మరికల్ స్టేషన్‌లో నిలపాలని శనివారం ఎంపీ డీకే అరుణను హైదరాబాద్‌లో కలిసిన బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. విశాఖ-రాయచూర్ మధ్యన త్వరలో ప్రారంభం కానున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, కృష్ణా మీదుగా రాయచూర్ వెళ్తున్న ఈ రైలును నిలిపితే ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే రాయచూర్ నుంచి బీజాపూర్ వెళ్లే ప్యాసింజర్ రైలును మహబూబ్‌నగర్ వరకు పొడగించేందుకు చొరవ చూపాలని విన్నవించారు. ఇందుకు ఆమె సానుకులంగా స్పందిస్తూ ఈ విషయంపై రైల్వేశాఖ మంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సన్‌గౌడ్, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజేష్, వేణు, శ్రీరాం, విజయ్, నరేష్, మహేష్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ మురళి

మరికల్: తల్లిదండ్రుల అధ్యాపకుల పేరును నిలబెట్టిందుకు విద్యార్థులు నిర్ధేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు కష్టపడి చదవాలని ఎస్‌ఐ మురళి అన్నారు. మండలంలోని మణికంఠ జూనియర్ కళాశాల విద్యార్థులు సూర్యచంద్ర పంక్షన్ హాల్‌లో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించేందుకు కష్టపడి చదివిన వారే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, సూర్యమోహన్‌రెడ్డి, రవికిరణ్, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేష్

కృష్ణా: మండలంలోని ముగహర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలను శనివారం కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేష్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులకు విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం తరగతుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు ఈరన్న, ఉపాధ్యాయులు అజయ్, ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న షీటీం పోలీసులు

నారాయణపేట: కళాశాలలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని షీటీం పోలీసులు బాలరాజు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, ట్రాఫిక్ చట్టాలు తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే షీటీం నంబర్ 8712670398కి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ కనబరిచి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు చెన్నయ్య, లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని హరించే గుట్కాలను మానేయాలి



మాట్లాడుతున్న జీహెచ్‌ఓ నారాయణ

దామరగిద్ద: ఆరోగ్యానికి హానిచేసే గుట్కాలనే మానేయాలని, పంచాయతీలో నిషేధిత గుట్కాపాకెట్ల వినియోగాన్ని నిషేధించాలని జీహెచ్‌ఓ నారాయణ, సూపర్‌వైజర్ కిష్టమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముస్తాపేట్‌లో గుట్కాల నిషేధంపై నిర్వహించిన అవగాహన సదస్సులో గుట్కాలు తినడంతో ఎదురయ్యే క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో గుట్కాల నిషేధంపై నాయకులు, యువకులు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలప్ప, ఎంపీటీసీ అంజిలయ్యగౌడ్, నరేందర్‌గౌడ్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషక ఆహారం అందజేయాలి



వంటగదిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

ధన్వాడ: విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందజేయాలని మండల ప్రత్యేక అధికారి మొగులప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ పాఠశాల ఎస్సీ హాస్టల్, కొండాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీచేపట్టిన పోలీసులు

నారాయణపేట: పోలీస్ అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లగ్ డే) వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో పోలీసులు, విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ మేరకు.. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రజల రక్షణలో శాంతిభద్రతల పరిరక్షణలో నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తూ విధి నిర్వహణలో భాగంగా పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందిన అమరవీరులను స్మరించుకుంటూ జోహార్.. జోహార్ అంటూ సవార్కర్ చౌరస్తా నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ రాముడు, అడ్వకేట్ రఘువీర్ యాదవ్, పీఈటీ రమణ, చంద్రశేఖర్ లెక్చరర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలుడిని పాఠశాలలో చేర్పించిన సీఆర్పీ



నర్వ: మండలంలోని కల్వాల్ గ్రామానికి చెందిన వెంకటేష్ తండ్రి బాల్‌రాజు అనే అనాథ విద్యార్థిని సీఆర్పీ నర్సింహులు శనివారం పాఠశాలలో చేర్పించారు. ఆయన మాట్లాడుతూ.. వెంకటేష్ అనే బాలుడికి తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథగా ఉన్నాడన్నారు. బాలు డిని మహబూబ్‌నగర్‌లోని పట్టణ గురుకుల పాఠశాలలో 7వ తరగతిలో చేర్పించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్నాళ్ల ముచ్చటే !



దిష్టిబొమ్మల్లా మిగిలిపోయిన ట్రాఫిక్ సిగ్నల్స్

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా ఎన్నికల ముందు హడావిడిగా శ్రీ సత్యనారాయణచౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ట్రాఫిక్ పోలీసులను షిఫ్టుల వారిగా ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరిస్తూ వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అయితే కొద్దిరోజుల తర్వాత వాటిని మూలకు పారేయడంతో తిరిగి పాత పద్దతే కొనసాగుతూ ఉంది. వాహనదారులు ఎలా పడితే అలా చౌరస్తాలో వాహనాలు ముందుకు తీసుకురావడంతో చాలా సార్లు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. మరికొందరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కేవలం కెమరాలో ఫొటోలు దించడానికే సమయం కేటాయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలా?



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సాగర్

మాగనూర్: కేంద్ర, రాష్ట్ర స్థానిక ఎన్నికలు విడిగా జరగడం ఖర్చుతో కూడిన పని అని అభివృద్ధి కుంటుపడుతుందని వితండ వాదన చేస్తున్న ప్రభుత్వాలు కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు మాఫీలు చేస్తున్న ఈ వాదన తేవడం విడ్డూరంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ అన్నారు. శనివారం జమిలి ఎన్నికలు-ఒకే దేశం ఒకే ఎన్నిక కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానిక శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జమిలి ఎన్నికల విధానం అప్రజాస్వామికమని నియంతృత్వ ధోరణికి నిదర్శనమని అన్నారు. ఈ విధనానికి వ్యతిరేకంగా అందరి కలిసి పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, పి. ఆంజనేయులు, సీఆర్ గోవింద్ రాజ్, భరత్‌కుమార్, వెంకటయ్య, నర్సింహా, బాలు, అశోక్‌బాబు, దేవప్ప పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



మట్టిని తరలించేందుకు సిద్ధం ఉన్న జేసీబీ

నర్వ: అక్రమంగా మట్టిని రవాణా చేస్తుండడంతో మట్టి గుట్టలన్ని కరుగుతున్నాయని పాథర్చేడ్ గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ అవసరాల కోసం కాకుండా కొంతమంది జేసీబీలు పెట్టి, టారస లాంటి పెద్ద పెద్ద వాహనాలలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా ఈ క్రమ మట్టి రవాణా కొనసాగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సైతం ఏలాంటి సమాచారం ఇవ్వకుండానే బహిరంగగానే కొనసాగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.